


భారత్‌లో 8వేల ఖాతాలను బ్లాక్ చేసినట్టు 'ఎక్స్' ప్రకటించింది. భారత ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. తమ ఆదేశాలను పాటించని స్థానిక ఉద్యోగులకు జరిమానా విధించడంతో సహా నిర్బంధంలోకి తీసుకోవాల్సి వస్తుందని భారత ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినట్టు 'ఎక్స్' స్పష్టం చేసింది.

# బరి తెగించిన పాక్.. పౌరులపై అటాక్

- జనావాసాలే లక్ష్యంగా విచ్చలవిడి దాడులు
- సరిహద్దు జిల్లాల్లో గ్రామాలపైకి షెల్లింగ్
- ముగ్గురు మృతి, పలువురికి గాయాలు
- సమర్థంగా తిప్పికొడుతున్న భారత సైన్యం
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా పాక్ దాడులు
- కవచాలుగా పౌర విమానాల వినియోగం
- తప్పుడు సమాచారం వ్యాప్తిచేస్తున్న పాక్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్‌ను నేరుగా ఎదుర్కొనే సత్తాలేక పాక్ సైన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది. నిరాయుధులైన ప్రజల ప్రాణాలను బలిగొంటున్నది. ఆస్తులను ధ్వంసం చేస్తున్నది. శుక్రవారం మరో ఇద్దరు అమాయకులను బలిగొన్నది. వీరితోపాటు ఏపీకి చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. మరోవైపు యుద్ధ సమయంలో కనీస ధర్మం పాటించకుండా ప్రార్థనా మందిరాలపై పాక్ దాడులు చేస్తున్నది. పౌర విమానాలను, విద్యార్థులను రక్షణ కవచాలుగా వాడుకునే దుస్థితికి దిగజారింది. పాక్ చేస్తున్న దాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతున్నది.

### సరిహద్దు గ్రామాల్లో శకలాలు గుర్తింపు

పంజాబ్‌లోని భటిండా జిల్లా హోషియార్‌పూర్, తుంగ్వాలి, కామాహి దేవి, బుర్జ్ మహిమ గ్రామాల్లో మిస్సైల్ శకలాలు గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'గురువారం అర్ధరాత్రి కొన్ని వస్తువులు మా గ్రామంలో పడి భారీ శబ్దంతో పేలిపోయాయి. దీంతో చుట్టుపక్కల ఇండ్ల అద్దాలు, తలుపులు, పశువుల పాకలు ధ్వంసం అయ్యాయి' అని పేర్కొన్నారు. అవి పడినచోట మూడు అడుగుల లోతుతో గొయ్యి ఏర్పడిందన్నారు. పఠాన్‌కోట్‌లోని ఓ గ్రామం నుంచి మోర్టార్ షెల్ భాగాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కంగ్రా జిల్లాలో పఠాన్‌కోట్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కరియాల్ గ్రామంలో బాంబు శకలాల వంటివి లభ్యమైనట్టు అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లా కిషన్ ఘాట్‌లోని ఓ నర్సరీ సమీపంలో బాంబు వంటి వస్తువును గుర్తించినట్టు కొత్వాలి ఎస్‌హెచ్‌వో ప్రేమ్ దాన్ తెలిపారు. ఆర్మీ అధికారులు దానిని నిర్వీర్యం చేశారన్నారు. భారత్ కూల్చివేసిన పాక్ డ్రోన్‌కు చెందినదై ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

### మూడు జిల్లాల్లో ప్రజల తరలింపు..

జమ్ము కశ్మీర్‌లోని బారాముల్లా, కుప్వారా, బండిపొరా, రాజౌరి జిల్లాల్లోని ఎల్వోసీ వెంట ఉన్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. పాక్ సైన్యం జనావాసాలే లక్ష్యంగా షెల్లింగ్‌కు పాల్పడుతుండటంతో కొందరిని బంకర్లలోకి, మరికొందరిని పొరుగు జిల్లాల్లోని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు జరిపిన దాడుల్లో 100కు పైగా ఇండ్లు, డజనుకుపైగా వాణిజ్య భవనాలు, పలు ప్రభుత్వ భవనాలు ధ్వంసం అయ్యాయన్నారు.


బారాముల్లా జిల్లాలోని యూరీలో పాక్ దాడుల వల్ల దెబ్బతిన్న తన ఇంటిని పరిశీలిస్తున్న యజమాని

## జమ్ముకశ్మీర్‌లో ఇద్దరు పౌరుల మృతి

**జమ్ముకశ్మీర్‌లోని** రాజౌరి, పూంచ్, కుప్వారా, బారాముల్లా జిల్లాలవైపు గురువారం రాత్రి మొదలు శుక్రవారం తెల్లవారుజాము వరకు పాకిస్థాన్ సైన్యం విచ్చలవిడిగా కాల్పులు జరిపింది. జనావాసాలే లక్ష్యంగా మోర్టార్ షెల్స్ ప్రయోగించిందని స్థానికులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 3:50 గంటల నుంచి 4:45 గంటల వరకు పూంచ్, రాజౌరి జిల్లాల్లో భారీ ఎత్తున దాడులకు పాల్పడినట్టు అధికారులు తెలిపారు. దీంతో ఆ సమయంలో బ్లాక్‌ఔట్ ప్రకటించడంతోపాటు అలర్ట్ సైరన్లు మోగించామన్నారు. ఈ దాడులతో ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. అనేక ఇండ్లు, వాహనాలు ధ్వంసం అయ్యాయన్నారు. పూంచ్ జిల్లా మెంధర్ సెక్టార్‌లోని లోరాన్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో మహ్మద్ అబ్రార్ అనే పౌరుడు మరణించారని, ముగ్గురు గాయపడ్డారని తెలిపారు. యూరీ సెక్టార్‌లోని యూరీ, సియాల్‌కోట్, బోనియార్, కమాల్‌కోట్, మోహ్రా, గింకిల్ తదితర ప్రాంతాలపైకి మోర్టార్ షెల్స్‌తో దాడి చేసినట్టు అధికారులు చెప్పారు. మోహ్రా ప్రాంతంలో ఒక కుటుంబం దాడుల నుంచి తప్పించుకొని సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, వారు ప్రయాణిస్తున్న కార్‌పై షెల్ పడి పేలిందన్నారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నర్గిస్ బేగం అనే మహిళ మరణించినట్టు చెప్పారు. ఆమె కుటుంబానికి చెందిన మరో ఇద్దరు గాయపడ్డట్టు వెల్లడించారు. పాక్ దాడులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టిందని అధికారులు తెలిపారు.

### మరో గురుద్వారాపై దాడి

పాక్ సైన్యం కనీస ధర్మం మరిచి ప్రార్థనా మందిరాలపైనా పాక్ దాడులు చేస్తున్నది. శుక్రవారం పూంచ్ సమీపంలోని మరో గురుద్వారాపై మోర్టార్ షెల్స్‌తో దాడి చేసినట్టు అధికారులు తెలిపారు. డేరా సంత్ పురా నాగాలి సాహిబ్ గురుద్వారా ప్రహరీ ధ్వంసం అయ్యిందని, ప్రధాన భవనానికి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. బుధవారం పూంచ్ జిల్లాలోని శ్రీ గురుసింగ్ సభా గురుద్వారాపై పాక్ సైన్యం మోర్టార్ షెల్‌తో దాడి చేసిన సంగతి తెలిసిందే.

### రక్షణ కవచాలుగా విద్యార్థులు, పౌరవిమానాలు..

పాకిస్థాన్ రక్షణ వలయంలోని రెండో అంచెలో మదరసా విద్యార్థులు ఉంటారని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ శుక్రవారం ప్రకటించారు. పార్లమెంటులో ఆయన మాట్లాడుతూ, 'మదరసాల్లో చదువుతున్న యువత మన రెండో అంచెలో ఉండే రక్షక దళం. సమయం వచ్చినపుడు వారిని వంద శాతం ఉపయోగించుకుంటాం' అని చెప్పారు.

మరోవైపు.. పాకిస్థాన్ పౌరవిమానాలను సైతం అడ్డుపెట్టుకున్నదని తేలింది. బుధవారం రాత్రి భారత్‌పైకి మిస్సైళ్లు, డ్రోన్లు ప్రయోగించిన సమయంలో ఫ్లైనాస్ ఏవియేషన్‌కు చెందిన ఎయిర్ బస్ 320 విమానం సరిహద్దుకు సమీపంలో పాక్ గగనతలంలో ప్రయాణించిందని అధికారులు తెలిపారు. దీంతో ఆ విమానానికి ఎలాంటి నష్టం కలగకుండా పాక్ దాడులను తిప్పికొట్టామని చెప్పారు. వాస్తవానికి యుద్ధసమయాల్లో సరిహద్దు సమీపంలోని ఎయిర్‌పోర్టులను, గగనతలాలను మూసివేస్తుంటారు.

### భారత్‌పై అసత్య ప్రచారం

పాక్ తన తప్పులను, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు తన అనుకూల మీడియా, ఇన్‌ఫ్లూయెన్సర్లు, రాజకీయ నేతల సాయంతో తప్పుడు తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నది. భారత్‌కు చెందిన విమానాలను, డ్రోన్లను కూల్చేశామంటూ పాత ఫొటోలు, వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నదని భారత్ ఆధారాలతో సహా నిరూపించింది.

## దాయాది డ్రోన్లు కూల్చివేత

- రెండో రోజూ పాక్ దుస్సాహసం
- వందల సంఖ్యలో దూసుకొచ్చిన డ్రోన్లు
- కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లో దాడులు
- సమర్థంగా తిప్పికొట్టిన భారత ఆర్మీ
- ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే వందకు పైగా డ్రోన్ల కూల్చివేత
- నియంత్రణ రేఖ వెంట పాకిస్థాన్ విచక్షణారహితంగా కాల్పులు
- సరిహద్దు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్లాకౌట్.. సైరన్ల మోత



న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్ వరుసగా రెండో రోజు భారత్‌పై డ్రోన్ల దాడికి దిగింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, రాజస్థాన్, గుజరాత్, పంజాబ్‌లోని 20 నగరాలు లక్ష్యంగా శుక్రవారం రాత్రి వందల సంఖ్యలో డ్రోన్లు దూసుకొచ్చాయి. అవంతిపురా వైమానిక స్థావరంపై దాడియత్నాన్ని భారత్ నిర్వీర్యం చేసింది. భారత్ తక్షణమే పలు ప్రాంతాల్లో తన గగనతల రక్షణ వ్యవస్థను రంగంలోకి దించింది. పాక్ ప్రయోగించిన దాదాపు అన్ని డ్రోన్లను కూల్చివేసింది. డ్రోన్లు కనిపించిన వెంటనే ఆయా నగరాల్లో సైరన్లు మోగడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి బ్లాక్‌అవుట్ విధించారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి కుప్వారా, సాంబా, పూంచ్, ఫిరోజ్‌పూర్, ఉరి, నౌగాం, హంద్వారా సెక్టార్లలో పాక్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులకు దిగింది.

జమ్ముకశ్మీర్‌లో జమ్ము, సాంబా, రాజౌరీ, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వద్దకు వచ్చిన పాక్ డ్రోన్లను భారత సైన్యం కూల్చివేసింది. జమ్ములో గంట వ్యవధిలో వంద వరకు డ్రోన్లను కూల్చివేసినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. అవంతిపురా ఎయిర్‌బేస్ వద్ద, దక్షిణ కశ్మీర్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్టు పేర్కొన్నాయి. మన గగనతల రక్షణ వ్యవస్థ శత్రుదేశపు డ్రోన్లను ఢీకొన్నప్పుడు ఆ పేలుడు శబ్దం వెలువడినట్టు వివరించాయి. ఉధంపూర్‌లో కూడా డ్రోన్లను కూల్చివేశామని వెల్లడించాయి. శ్రీనగర్‌లోని ఓ మసీదు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలను బయటకు రావొద్దని, దీపాలు వెలిగించవద్దని హెచ్చరించారు. అమృత్‌సర్‌లో కూడా డ్రోన్లతోపాటు క్షిపణులను అడ్డుకొన్నామని రక్షణ శాఖ అధికారులు తెలిపారు.

### రాజస్థాన్‌లో పదుల సంఖ్యలో డ్రోన్లు

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పాక్ పదుల సంఖ్యలో ప్రయోగించిన డ్రోన్లను భారత్ కూల్చివేసింది. డ్రోన్ల దాడి నేపథ్యంలో అధికారులు సరిహద్దు జిల్లాల్లో రెడ్ అలర్ట్, బ్లాక్‌అవుట్ ప్రకటించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రోన్లు కనిపించగానే జైసల్మేర్, పోఖ్రాన్‌తోపాటు పలు పట్టణాల్లో సైరన్లు మోగాయి. ముందుగా అర్ధరాత్రి నుంచి బ్లాక్‌అవుట్ ఉంటుందని ప్రకటించినప్పటికీ డ్రోన్లు కనిపించగానే రాత్రి 9.00 గంటలకే విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.


### పేలుళ్ల శబ్దం వినిపించింది: ఒమర్ అబ్దుల్లా

జమ్ములోని పలు ప్రాంతాల నుంచి పేలుళ్ల శబ్దం వినిపించిందని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దని, వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తమకు తెలిసిన సమాచారాన్ని ఇతరులకు పంపించవద్దని కోరారు.

### పంజాబ్‌లోని 4 జిల్లాలలో బ్లాక్ అవుట్

ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, హోషియార్‌పూర్‌తోసహా పంజాబ్‌లోని అనేక ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం విద్యుత్తు సరఫరాను పూర్తిగా నిలిపివేసి బ్లాక్‌అవుట్ విధించింది. పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్ జిల్లాలలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, హోషియార్‌పూర్ జిల్లాలలో వైమానిక దాడులు జరగవచ్చన్న హెచ్చరికగా సైరన్లు మోగించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, జమ్ము, పఠాన్‌కోట్‌తోసహా వివిధ ప్రదేశాలలోని సైనిక స్థావరాలపై దాడులు చేసేందుకు గురువారం రాత్రి పాకిస్థాన్ చేసిన ప్రయత్నాన్ని భారతీయ దళాలు భగ్నం చేశాయి.

### లోకం పోకడ




## యుద్ధంలో తలదూర్చం

దాంతో మాకు సంబంధం లేదు

భారత్, పాక్‌లను కట్టడి చేయలేం

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



న్యూఢిల్లీ, మే 9: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో అమెరికా నుంచి కీలక ప్రకటన వెలువడింది. యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని, ప్రాథమికంగా దాంతో తమకు ఎటువంటి సంబంధం లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ గురువారం విస్పష్టంగా ప్రకటించారు. 'భారత్, పాకిస్థాన్‌ను అమెరికా కట్టడి చేయలేదు. ఉద్రిక్తతలను తగ్గించాలని మాత్రమే ఆ రెండు అణ్వస్త్ర దేశాలకు మేము సూచించగలం' అని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరిగే అవకాశాలపై ట్రంప్ ప్రభుత్వం ఏ రకంగా ఆందోళన చెందుతోందన్న ప్రశ్నకు అణ్వస్త్రాలు కలిగిన రెండు దేశాలు ఘర్షణకు దిగితే అది భారీ యుద్ధానికి దారితీయగలదన్న ఆందోళన ఉందని వాన్స్ చెప్పారు. సాధ్యమైనంత త్వరితంగా ఉద్రిక్తతలు తగ్గాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పిన మాటలను ఆయన ఉటంకించారు. భారత్‌కు పాకిస్థాన్‌తో విరోధం ఉందని, అందుకు పాక్ జవాబిచ్చిందని ఆయన చెప్పారు. ఈ సమయంలో ఉద్రిక్తతలను కాస్త తగ్గించుకోవాలని మాత్రమే తాము చెప్పగలమని ఆయన తెలిపారు.

### భారతీయులకు చెప్పలేం

ఆయుధాలను పక్కనపెట్టమని భారతీయులకు అమెరికా చెప్పలేదని వాన్స్ తెలిపారు. పాకిస్థాన్‌కు కూడా ఆయుధాలు పక్కనపెట్టాలని తాము చెప్పలేమన్నారు. ఈ విషయాన్ని దౌత్యపరమైన మార్గాల ద్వారా మాత్రమే తాము కొనసాగిస్తామని ఆయన అన్నారు.' ఇది విస్తృతమై ప్రాంతీయ యుద్ధానికి లేదా అణు యుద్ధానికి దారితీయకూడదని మాత్రమే మేము ఆశిస్తున్నాము, అంచనా వేస్తున్నాము' అని వాన్స్ తెలిపారు. అణుయుద్ధం జరిగితే అది వినాశనానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ఆ పరిస్థితి వస్తుందని ప్రస్తుతానికైతే తాము భావించడం లేదని వాన్స్ అభిప్రాయపడ్డారు.

## పాకిస్థాన్‌కు మద్దతుపై చైనా యూటర్న్

భారత్, పాక్ ప్రశాంతంగా ఉండాలని పిలుపు

ఉగ్రవాదానికి తాము వ్యతిరేకమని వెల్లడి



న్యూఢిల్లీ, మే 9: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాలుస్తున్న వేళ చైనా తన వైఖరిపై మాట మార్చింది. ప్రస్తుత పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన చైనా.. శాంతి, సుస్థిరతకు సంబంధించిన విశాల ప్రయోజనాల కోసం భారత్, పాక్ ప్రశాంతంగా ఉండాలని సూచించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు అంతర్జాతీయ సమాజంతో చేతులు కలిపేందుకు తాము సిద్ధమని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేసినట్టు ఏఎన్‌ఐ తెలిపింది. అన్ని రకాల ఉగ్రవాదాన్ని చైనా ఖండిస్తున్నట్లు కూడా ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిణామాలపై చైనా ఆందోళన చెందుతోందని, భారత్, పాకిస్థాన్ ఇప్పుడు, ఎప్పుడూ ఇరుగు పొరుగు దేశాలేనని ఆమె వ్యాఖ్యానించారు.

## మాది సహాయ పాత్రే

సింధూ జలాల ఒప్పందంపై బంగా

న్యూఢిల్లీ, మే 9: భారత్, పాకిస్థాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ, సైనిక ఉద్రిక్తతలను ప్రపంచ బ్యాంకు పరిష్కరించనున్నట్లు సాగుతున్న ఊహాగానాలకు శుక్రవారం తెరపడింది. తమది సహాయక పాత్ర మాత్రమేనని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా ప్రకటించారు. 'ప్రపంచ బ్యాంకు జోక్యం చేసుకుని ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందోనంటూ ఊహాగానాలు మీడియాలో జోరుగా సాగుతున్నాయి. అయితే అవన్నీ అవాస్తవాలు. ప్రపంచ బ్యాంకుది కేవలం సహాయక పాత్ర మాత్రమే' అని అజయ్ బంగా స్పష్టం చేశారు. అజయ్ బంగా గురువారం ప్రధాని నరేంద్ర మోదీని న్యూఢిల్లీలో కలుసుకున్నారు. సింధూ నదీ జలాల పంపకంపై భారత్, పాక్ మధ్య సుదీర్ఘకాలంగా వివాదం నడుస్తున్న తరుణంలో 1960లో జోక్యం చేసుకున్న ప్రపంచ బ్యాంకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదర్చడంలో మధ్యవర్తి పాత్రను పోషించింది. రెండు దేశాల ఇంజనీర్ల మధ్య తొమ్మిది సంవత్సరాల పాటు సంప్రదింపులు జరిగిన తర్వాత ఒప్పందంపై ఉభయ దేశాల అధినేతలు సంతకాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే.


ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా హైదరాబాద్‌లో భారత జాగృతి నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, భారత జాగృతి కార్యకర్తలు, నగరవాసులు

## సైన్యానికి అండగా నిలుద్దాం

- సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉండగా అందాల పోటీలు వద్దు
- పాలన చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి : కవిత
- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారత జాగృతి భారీ ర్యాలీ
- వీర మరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు ఘననివాళి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : పాకిస్థాన్‌పై భారత్ చేస్తున్నది ధర్మయుద్ధమని, అంతా ఏకమై భారత సైన్యానికి అండగా నిలుద్దామని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం విజయవంతంగా ధ్వంసం చేసిందని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారత సైన్యానికి సంఘీభావంగా భారత జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు శుక్రవారం తీసిన భారీ ర్యాలీకి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్థాన్ దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం, స్థైర్యాన్ని నింపేందుకు ర్యాలీ తీశామని చెప్పారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 'ఇది ధర్మయుద్ధం. భారత్ ఎప్పుడూ తప్పు చేయదు. నీతి, నిజాయితీతోనే యుద్ధం చేస్తున్నాం. మనం పాకిస్థాన్‌లోని సామాన్యులను ఏమీ అనలేదు. కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశాం' అని చెప్పారు.

### అందాల పోటీలు వాయిదా వేయాలి

దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న క్రమంలో రాష్ట్రంలో నిర్వహించ తలపెట్టిన మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని, ఐపీఎల్‌ను వాయిదా వేసినట్టుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని ప్రభుత్వానికి కవిత విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొంటే తెలంగాణలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు వస్తుందని చెప్పారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావివ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం చేయగాకపోతే, ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేకపోతే పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. పరిపాలన చేతకాని సీఎం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రజలైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారని, గొంతెమ్మ కోరికలేం కోరడం లేదని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి ఎప్పుడేం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడటంపై ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు.

# ఆర్మీ జవాన్ వీరమరణం

- పాకిస్థాన్ ముష్కరుల కాల్పుల్లో అసువులు బాసిన తెలుగు జవాన్
- సైనికుడు మురళీనాయక్ స్వస్థలం ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండా
- 2022లో అగ్నివీర్‌గా సైన్యంలో చేరిక
- నేడు స్వస్థలానికి పార్థివదేహం
- నివాళులు అర్పించిన ప్రముఖులు

'కొడుకా.. నా కన్నా.. రా నాన్నా.. నా బంగారుకొండా' అంటూ ఆ తల్లి రోదన చూసేవారికి ఆవేదన కలిగించింది. 'దేశం దేశమంటూ.. ఆ దేశం కోసమే ప్రాణమిచ్చావా బిడ్డా' అని గుండెలు బాదుకుంటున్న ఆ మాతృమూర్తిని ఆపడం ఎవరితరమూ కాలేదు. కొడుకు భవిష్యత్తును ముష్కరులు ఒక్క నిమిషంలోనే చెరిపివేసిన ఘటనను తలుచుకుంటూ బిక్కుబిక్కుమంటున్న ఆ తండ్రిని చూసి చలించని హృదయం లేదు. 'బతికితే సైనికుడిగానే బతుకుతా.. చస్తే సైనికుడిగానే చస్తా' అన్న మురళీనాయక్ మాటలను తలుచుకొని బంధుమిత్రులు రోదించిన తీరుతో ఊరంతా ఘొల్లుమన్నది. యూరిలో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ స్వస్థలమైన ఏపీలోని కల్లితండాలో కనిపించిన హృదయవిదారక దృశ్యాలు.

హైదరాబాద్/ముంబై, మే 9 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండకు చెందిన శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయి దంపతుల ఏకైక సంతానమే మురళీనాయక్ (23).మురళీనాయక్ చిన్నతనంలోనే ఈ కుటుంబం బతుకుదెరువు కోసం ముంబై వెళ్లింది. అక్కడి ఘట్‌కోపర్ ప్రాంతంలో శ్రీరామ్‌నాయక్ కూలిపనులు చేస్తూ మురళిని చదివించాడు. మురళి 4వ తరగతి వరకు ముంబైలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత ఉన్నత చదువులన్నీ ఏపీలో పూర్తిచేశాడు. భారత సైన్యంలోకి వెళ్లాలని మురళికి చిన్ననాటి నుంచి కోరిక ఉండేది. తన కోరికను నెరవేర్చుకునేందుకు తల్లిదండ్రులను ఒప్పించి మళ్లీ ముంబై వెళ్లి నాసిక్‌లోని డియోలాలిలో ఆర్మీ శిక్షణ తీసుకున్నాడు. 2022లో అగ్నివీర్‌గా ఇండియన్ ఆర్మీలో చేరాడు. మురళికి మొదట అసోంలో పోస్టింగ్ రాగా, తర్వాత పంజాబ్‌లో విధులు నిర్వర్తించాడు. యుద్ధ సమయంలో అతనికి యూరీలో విధులు కేటాయించారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల చొరబాటు దుశ్చర్యను అడ్డుకునే క్రమంలో మురళి అసువులుబాసాడు.

### చేస్తే జవాన్‌గానే.. చస్తే దేశం కోసమే

'నాన్నా నేను ఆర్మీకి తప్ప.. మరో ఉద్యోగం చెయ్యను. చేస్తే జవాన్‌గానే చేయాలి.. అవసరమైతే దేశం కోసం ప్రాణాలు విడువాలి. నా శవంపై జాతీయ జెండా కప్పాలి. ఇవే నా కోరికలు.. నా ఆశయాలు' అంటూ చిన్ననాటి నుంచే మురళీనాయక్ ఇండియన్ ఆర్మీపై మక్కువ పెంచుకున్నాడు. భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య మురళీనాయక్ శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు యురిలో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందాడు. ఇంతటి దేశభక్తి కలిగిన యువ సైనికుడు మురళీనాయక్ ముష్కరులను ఎదుర్కొంటూ అతి చిన్న వయసులోనే దేశంకోసం ప్రాణాలు అర్పించాడు. 'ఒక్కరోజైనా సైనికుడిగా బతకాలి' అనే అతని దేశభక్తి.. యావత్తు దేశప్రజల్లో స్ఫూర్తిని నింపింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత.. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో చొరబాటుదారులతో పోరాడుతూ అసువులు బాసాడు.


శ్రీ సత్యసాయి జిల్లా కల్లితండాలో రోదిస్తున్న అగ్నివీర్ మురళీ నాయక్ తల్లి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో మురళీ నాయక్ )

### మురళీనాయక్‌కు అశ్రు నివాళి: కేటీఆర్

ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన వీరజవాన్ మురళీనాయక్ మృతికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. భారతీయుల రక్షణ కోసం అమరుడైన మురళీ నాయక్‌కు జోహార్ అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

### అమ్మవారి జాతర కోసం సొంతూరికి..

తమ స్వస్థలమైన కల్లితండాలో అమ్మవారి జాతర కోసం ఈ నెల 2న మురళీనాయక్ తల్లిదండ్రులు వచ్చారు. అక్కడ వారు జాతర పనుల్లో ఉండగానే కొడుకు అసువులు బాసాడనే దుర్వార్త తెలిసి, దుఃఖసాగరంలో మునిగిపోయారు. తల్లి జ్యోతిబాయి కొడుకును తల్చుకుంటూ విలపించిన తీరు.. చూసేవారి గుండెలను తడిమింది. కొడుకు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కండ్లలోంచి వస్తున్న కన్నీటిని అదిమిపడుతున్న ఆ తండ్రిని చూసి, ఊరంతా బోరున విలపించింది. ఎప్పుడూ దేశం, ఆర్మీ, యుద్ధం గురించి కబుర్లు చెప్పే స్నేహితుడు వీరమరణం పొందాడని తెలుసుకున్న అతని మిత్రుల కన్నీటిని ఆపడం ఎవరితరమూ కాలేదు. కల్లితండా సమీప గ్రామాలు, తండాలవాసులు వచ్చి మురళీనాయక్‌కు కన్నీటి నివాళులు అర్పించారు. ముంబై ఘాట్‌కోపర్ వార్డు నంబర్ 133లో మురళీనాయిక్‌కు సంతాపం తెలుపుతూ బ్యానర్లు ఏర్పాటు చేసి, స్థానికులు శ్రద్ధాంజలి అర్పించారు.

### వీరజవాన్‌కు ప్రముఖుల నివాళి

యూరి ఉగ్రదాడిలో వీరమరణం పొందినది తెలుగు జవాన్ అని తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. మురళీనాయక్ వీరమరణంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్ ఎక్స్ వేదికగా నివాళులు అర్పించారు. దేశరక్షణ కోసం పాకిస్థాన్ ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన బంజారా ముద్దుబిడ్డ మురళీనాయక్ ప్రాణ త్యాగం అజరామరమని మాజీ ఎంపీ వినోద్ కుమార్ కొనియాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మురళీనాయక్‌కు ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు.